http://dc-epaper.com/andhrabhoomi/PUBLICATIONS/DC/AB/2012/07/0...

**Andhra Bhoomi**
**Title :**
**Author :**
**Location :**
**Article Date : 07/03/2012**

# మంచి కార్యక్రమాల 'తోట'..

ఇతర ఏ చానెల్‌లో రానివి సప్తగిరిలో మాత్రమే వచ్చే మంచి కార్యక్రమాల్లో 'తెలుగు తోట', 'శాస్త్ర' గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

తెలుగులో బోలెడన్ని చానెల్స్ ఉన్నాయి. కాని తెలుగు సాహిత్యాన్ని గురించి పట్టించుకున్నవాటిని వేళ్లమీద లెక్కబెట్టుకోవచ్చు. కొన్ని చానెల్స్ సాహిత్య కార్యక్రమాల పేరిట మొక్కుబడి కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నాయి. కాని సప్తగిరి చానెల్ వారు 'తెలుగు తోట' పేరిట ఒక అరగంట కార్యక్రమం సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు, అదే కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి 8.30కు పునఃప్రసారం చేస్తున్నారు. ఇందులో 'ఒక మంచి పుస్తకం' శీర్షికన పుస్తక పరిచయం, ఎవరైనా కవి స్వీయ కవితాగానం వుంటుంది. ఒక సాహిత్య అంశంపై ప్రసంగం లేదా ప్రముఖుల పరిచయం వుంటుంది. ఒక్కొక్కసారి సాహితీ ప్రముఖుల పరిచయాన్ని అరగంట ప్రసారం చేసే అవకాశం వుంటుంది. గతవారం అలా అరగంట ప్రసారం చేసిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత జొన్నలగడ్డ రాజగోపాల్ (వసుంధర) పాల్గొనడం ఈ కార్యక్రమానికే హైలెట్. వీరు, వీరి భార్య జొన్నలగడ్డ రామలక్ష్మి కలిసి 'వసుంధర' పేరుతో రచనలు చేస్తున్నారు. కొ.కొ. తర్వాత అంత విస్తృతంగా కథలు, నవలలు రాసినవారిలో 'వసుంధర' ఒక్కరే కనిపిస్తారు. ఈ ఇంటర్వ్యూలో జొన్నలగడ్డ రాజగోపాల్ అనేకానేక కొత్త విషయాలను, ముఖ్యంగా పాఠకులకు తెలియని ఎన్నో విషయాలను చెప్పడం బాగుంది. 'బొమ్మరిల్లు' పత్రికలో ఒక నెలలో వీరు రాసిన కథలే తొమ్మిది ప్రచురించాల్సిరావడంతో, ఆ పత్రిక ఎడిటర్ వాటిని మారు పేర్లతో ప్రచురించారట. ఇది చాలా ఆశ్చర్యం కలిగించే విషయం. ఇంటర్వ్యూ చేసే వ్యక్తి రొటీన్ ప్రశ్నలే అడిగినా- వాటన్నింటికి వివరంగా, విశ్లేషణాత్మకంగా సమాధానాలు చెప్పిన విధానం ఆకట్టుకుంటుంది. వసుంధర పేరు మీద జంట రచయితలు ఉన్నప్పటికీ, రామలక్ష్మి గారితో సంభాషణ చాలా క్లుప్తంగా జరగడం ఏం బాగాలేదు. ఒకే పేరు మీద ఇద్దరు రచయితలు రాస్తూ ఉన్నప్పుడు, రెండు భిన్నమైన శైలులు కనిపించాలి. కాని వీరి కథలన్నింటా ఒక శైలి కనబడుతుంది. ఇదెలా సాధ్యం అని ఇంటర్వ్యూ చేసే వ్యక్తి అడగాలి. బహుశా, ఎవరూ రాసినా ఆ కథను పూర్తిగా రాజగోపాల్ తిరగరాస్తున్నారని భావించాల్సి ఉంటుంది. వీరు నిర్వహిస్తున్న 'సాహితీ వైద్యం'శీర్షిక ద్వారా ఎంతోమంది కొత్త కథకులను తయారుచేసిన ఘనత కూడా వారికే దక్కుతుంది. ప్రచారానికి దూరంగా వుండే ఈ రచయితల గురించి సామాన్య పాఠకుడికి ఎక్కువగా ఏమీ తెలియదు. కాని ఈ ఇంటర్వ్యూ వల్ల వారి గురించి కొద్దో, గొప్పో తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడినందుకు సంతోషం. సాహిత్య అభిమానులు తప్పకుండా చూడాల్సిన కార్యక్రమం ఇది. అయితే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంలో ఇంటర్వ్యూ చేసే వ్యక్తిని, రచయితను మామూలు కుర్చీల్లో కూర్చోబెట్టి లాగించేస్తున్నారు. వాళ్ళు మొత్తంగా స్క్రీన్ మీద కనబడటంతో ఇబ్బందిగా ఫీలవడం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. రౌండ్ టేబుల్ కార్యక్రమంగా దీన్ని రూపొందిస్తే, ఆ టేబుల్ మీద కాగితాలు పెట్టుకుని మాట్లాడుకోవచ్చు. బస్ట్ సైజులో ఇంటర్వ్యూ చేసి లాంగ్ సైజు ఫొటోలను అప్పుడప్పుడు చూపించవచ్చు.

**తెలుగులో బోలెడన్ని చానెల్స్ ఉన్నాయి. కాని తెలుగు సాహిత్యాన్ని గురించి పట్టించుకున్నవాటిని వేళ్లమీద లెక్కబెట్టుకోవచ్చు. కొన్ని చానెల్స్ సాహిత్య కార్యక్రమాల పేరిట మొక్కుబడి కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నాయి. కాని సప్తగిరి చానెల్ వారు 'తెలుగుతోట' పేరిట ఒక అరగంట కార్యక్రమం సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు, అదే కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి 8.30కు పునఃప్రసారం చేస్తున్నారు.**

❖ ❖ ❖

ఇక ప్రతి ఆదివారం ఉదయం తొమ్మిది నుండి పది గంటల వరకు తిరిగి మధ్యాహ్నం మూడు నుండి నాలుగు వరకు 'శాస్త్ర' అనే విజ్ఞాన కార్యక్రమం లేదా సైన్స్ క్విజ్' లాంటి కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నారు. ఇది పూర్తిగా స్కూలు విద్యార్థులకు సంబంధించినది. స్కూలు విద్యార్థులకు ఉన్న నాలెడ్జి ఎంత? వారి అవగాహన ఎంత? అందునా తెలుగు మీడియం పిల్లలు ఎక్కువగా పాల్గొనే ఈ కార్యక్రమం కొంతవరకు ఆకట్టుకుంటుంది అన్న అనుమానం వెలిబుచ్చినవారే ఆశ్చర్యపోయే రీతిలో ఈ కార్యక్రమం విజయవంతం కావడం శుభసూచకం. ఈ క్రెడిట్ అంతా నిర్వాహకుడు కె.బి.గోపాలం గారికే దక్కుతుంది. ఈ కార్యక్రమంలో ప్రతి బ్యాచికి ఇద్దరు విద్యార్థులు చొప్పున మూడు బ్యాచీలు వుంటాయి. ఇందులో అవగాహన, పరిశీలన, పరిశోధన అనే మూడు రౌండ్లువుంటాయి. ఒక్కొక్క రౌండ్‌కు సంబంధించి నిర్వాహకుడు ప్రశ్నలను అడుగుతుంటారు. ఆ ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు చెప్పాలి. ఇక్కడ విశేషమేమిటంటే నిర్వాహకుడు ఆ ప్రశ్నను వాళ్ళకు వేయడంతోపాటు, నేర్పుగా వాళ్ళను బుజ్జగించి వాళ్ళతోనే ఆ సమాధానాన్ని రాబట్టే పద్ధతి చాలా బాగుంది. దీనివల్ల పిల్లల్లో బెరుకు, సంకోచం తొలగిపోయి ఫ్రీగా మెసలుకుంటారు.

కొన్ని క్విజ్ కార్యక్రమాల్లో సమాధానాలు చెప్పలేకపోతే నిర్వాహకుడు వాళ్ళను కంగారు పెట్టేయ్యడమో, హడలగొట్టడమో లేదా వాళ్ళ పరువు తీయడమో చేస్తుంటాడు. కాని ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు వాళ్ళకు తెలిసిన విషయాలతోనే, తెలియని విషయాన్ని ఆవిష్కరింపచేస్తాడు. పిల్లలు చెప్పలేకపోయినా, నిర్లిప్తంగా వ్యవహరించినా ఏ మాత్రం విసుక్కోకుండా నవ్వుతూ, నవ్విస్తూ వాళ్ళను ప్రోత్సహించే విధానం ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా పరిశోధన విభాగంలో పిల్లలు చేసిన ప్రయోగాలను వాళ్ళ నోటి ద్వారానే చెప్పిస్తూ, మళ్లీ వివరంగా వాటిపై వ్యాఖ్యానిస్తూ వాళ్ళను ప్రోత్సహించడం బాగుంది. ఓడినవారు, గెలిచినవారు అని కాకుండా అందరికీ బహుమతులు ఇవ్వడం కూడా బాగుంది. వ్యాఖ్యాతగా, నిర్వాహకుడిగా కె.బి.గోపాలం దీన్ని వన్ మాన్ షోగా తయారుచేశారు. వారు లేకపోతే ఈ కార్యక్రమమే లేదు. చిన్న పిల్లలతో ఈ సైన్స్ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడమే గొప్ప విషయం. ఇలాంటి కార్యక్రమం ద్వారా పిల్లలలో విజ్ఞానాభిలాషను పెంపొందించడానికి అవకాశముంది. అయితే ఇది సైన్స్ కార్యక్రమం కాబట్టి మరిన్ని ఎక్కువ స్లైడ్స్, ఫిలిం బిట్‌ల ద్వారా కార్యక్రమాన్ని ప్రసారం చేస్తే మరింత బాగా ఉంటుంది కదా! ఆలోచించగలరు. అలాగే కొన్ని విషయాలను ఆంగ్ల పదాలతో కూడా తెలియజేస్తే బాగుంటుంది. ఉదాహరణకు 'చేపలు ఎలా శ్వాసిస్తాయి' అనే ప్రశ్నకు షో చూస్తున్న పిల్లాడు వెంటనే 'గిల్స్‌తో' అని చెప్తాడు. అక్కడ జవాబు 'మొప్పలతో' అని వస్తుంది. ఇక వాటిని అనువదించి చెప్పాల్సి వచ్చింది. అంటే ముఖ్యమైన పదాలను ఆంగ్లంలో కూడా చెబితే విద్యార్థులకు ఆ కొత్త పదం పరిచయమవుతుంది. ఇంగ్లీష్ మీడియం పిల్లలు కూడా దాన్ని ఫాలో కాగలుగుతారు. ఇది అభినందనతో కూడిన సూచన మాత్రమే.

**-కె.పి.అశోక్‌కుమార్**


7/5/2012 9:24 AM